DESHA DESHAALA KAVITWAM

Matti Kuda Matladuthundi

Dr. Nalimela Bhaskar



ఈ కవిత్వం పుస్తకంలో గెరిల్లా పోరాట వీరులు. వియత్నాంలో తమ పిల్లలకు ఉగ్గుపాలతోనే యుద్ధ విద్యల్ని నేర్పించే తల్లులు, బ్రిటీష్ సైనికుని గుండెల్లో నిదురపోయే ఐరిష్ వీరులు కన్పిస్తారు. వ్యక్తి స్వేచ్ఛకి విఘాతం కల్గితే తల్లడిల్లిపోయే కవులు, అమ్మకానికి దొరికే అమ్మాయిలు, ఆకాశాలను విశాలం చేసి మాటని విచ్చుకొనేలా చేసే ఉత్తరాలు, తమ దేశంలోనే గుర్తింపు కార్డులు చూపిస్తేనే గాని నిలువనియ్యని పరిస్థితులు ఈ కవితల్లో కన్పిస్తాయి. ముప్పై వేల మంది రైతుల ఆత్మహత్యలకు సైతం చలించని థియోసాఫిస్టులు, యజమానులుగా సవారీ చేసే వాళ్ళుగా మొగుళ్ళుగా అధికారం చలాయించే మృగాళ్ళను ఈ కవితల్లో చూడవచ్చును. "నాకు కవిత్వం అంటే ఆరో ప్రాణం, గెథే నా అభిమాన కవి" అనే మార్క్స్, ఉరకలెత్తుతున్న ఉడుకు నెత్తురులు... ఈ పుస్తకం నిండా వున్నాయి.

– జూలూరు గౌరీశంకర్

అడుగుజాడలు
పబ్లికేషన్స్

దేశ దేశాల కవిత్వం

మట్టి కూడా మాట్లాడుతుంది

డా॥ నలిమెల భాస్కర్



దేశ దేశాల కవిత్వం

మట్టికూడా మాట్లాడుతుంది

డా॥ నలిమెల భాస్కర్

అడుగుజాడలు
పబ్లికేషన్స్

దేశ దేశాల కవిత్వం

డా॥ నలిమెల భాస్కర్

ప్రచురణ కాలం : 2010

ప్రతులకు : రాష్ట్రంలోని అన్ని పెద్ద పుస్తకాల షాపుల్లో

జూలూరి గౌరీశంకర్
జర్నలిస్ట్, సంపాదకుడు,
1-8-702/33/20ఎ
పద్మాకాలనీ, నల్లకుంట,
హైదరాబాద్-500 044

వెల : రు. 40/-

కవర్ డిజైన్ : అనబత్తుల లక్ష్మణ్

కంపోజింగ్ & పేజి లే అవుట్ : ఫాంట్‌లైన్ గ్రాఫిక్స్,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-44
ఫోన్ : 27660000

ముద్రణ : కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్,
విద్యానగర్, హైదరాబాద్-44
ఫోన్ : 2761 8261

"దేశ్ రాగ్"

ఇవి డా॥ నలిమెల భాస్కర్ ఆయా భాషల్లోంచి అనువదించిన ఆయా దేశాల కవితలు. ఫిలిప్పీన్స్, వియత్నాం మొదలైన దేశాల కవితలను ఆంగ్లంలోంచి అనువదించాడు. ముఖ్యంగా "మణ్ణుం శొల్లుం" (మట్టి కూడా మట్లాడుతుంది) అనే తమిళ పుస్తకం ఇందులోని చాలా కవితలకు మాతృక. వీటిల్లో అనేక కవితలు "ప్రజాసాహితి" లో వచ్చాయి. నిర్మలానంద గారు ఎంతో శ్రద్ధ తీసుకొని రాయని భాస్కరుని రాసే భాస్కరుడిగా అనువదింప చేశారు. అతనికి కృతజ్ఞతలు. "ప్రజాసాహితి"లో అచ్చయినవే కాక ఆంధ్రజ్యోతి, వార్త మొదలైన పత్రికల్లో వచ్చిన మరికొన్ని అనువాద కవితల్ని కూడా కలిపి "దేశ దేశాల కవిత్వం" పేర అందిస్తున్నాం.

ఈ కవిత్వ పుస్తకంలో గెరిల్లా పోరాట వీరులు, వియత్నాంలో తమ పిల్లలకు ఉగ్గుపాలతోనే యుద్ధ విద్యల్ని నేర్పించే తల్లులు, బ్రిటిష్ సైనికుని గుండెల్లో నిదురపోయే ఐరిష్ వీరులు కన్పిస్తారు. వ్యక్తి స్వేచ్ఛకి విఘాతం కల్గితే తల్లడిల్లిపోయే కవులు, అమ్మకానికి దొరికే అమ్మాయిలు, ఆకాశాలను విశాలం చేసి మాటని విచ్చుకొనేలా చేసే ఉత్తరాలు, తమ దేశంలోనే గుర్తింపు కార్డులు చూపిస్తే గాని నిలువనియ్యని పరిస్థితులు ఈ కవితల్లో కన్పిస్తాయి. ముప్పైవేల మంది రైతుల ఆత్మహత్యలకు సైతం చలించని థియోసాఫిస్టులు, యజమానులుగా సవారీ చేసే వాళ్ళుగా, మొగుళ్ళుగా అధికారం చలాయించే మృగాళ్లను ఈ కవితల్లో చూడవచ్చును. "నాకు కవిత్వం అంటే ఆరో ప్రాణం, గెథే నా అభిమాన కవి" అనే మార్పు, ఉరకలెత్తుతున్న ఉడుకు నెత్తురులు... పాఠకుల్ని ముందుకు, మునుముందుకు నడిపించే కవితలు ఈ పుస్తకం నిండా వున్నాయి.

ఈ కవితలు ఒక ప్రణాళిక ప్రకారం అనువదించినవి కావు. ఏమైతేనేం ఇంక దేశ దేశాల కవిత్వాన్ని చదువుదాం. అపురూపమైన "దేశ్ రాగాన్ని" విందాం.

-జూలూరు గౌరీశంకర్

ఫిలిప్పీన్స్ కవిత

గెరిల్లా పోరాట వీరుడు...

- జోస్ - మా - సిసోన్

గెరిల్లా పోరాట వీరుడు కవిలాంటివాడు
ఆకుల కదలికలూ
చిరుకొమ్మలు విరిగిపడే సవ్వడీ
సెలయేళ్ళ వరదలూ
నిప్పు వాసనా
వీడ్కోలు చెబుతూ నిష్క్రమించే పాదముద్రలూ
అన్నీ శ్రద్ధగా చెవులొగ్గి వింటాడు

గెరిల్లా పోరాట వీరుడు కవిలాంటివాడు
అతడు చెట్లూ, చేమలూ, పొదరిళ్ళూ, బండరాళ్ళతో
మమేకమైపోతాడు
ఉద్యమాల మెలకువల్ని లోతుగా అధ్యయనం చేస్తాడు
అనేక రూపాలు ధరించడంలో అత్యంత సమర్థుడు
గెరిల్లా పోరాట వీరుడు కవిలాంటివాడు

ప్రకృతిలో కలిసిపోతాడు

పచ్చదనంలో లీనమవుతాడు

హఠాత్తుగా శత్రువుపైకి లంఘించి

ఒడుపుగా పట్టే చతురుడతడు

గెరిల్లా పోరాట వీరుడు కవిలాంటివాడు

అంతా కోరుకునే

అందరి మనస్సుల్ని ఆకర్షించే

తలలూపే ఎర్రపూల పొదరిళ్ళలో

ఆలివ్ గ్రీన్ దుస్తులు ధరించిన పోరాట వీరులతో

నడచి వెళుతున్నాడు

శత్రుదుర్గమ్మీద దండయాత్ర చేస్తున్నాడు

ఇది అంతంలేని అద్భుత మహాప్రస్థానం

ఇది ప్రజాయుద్ధం–ప్రజాకావ్యం

(1939లో జన్మించిన సిసోన్ ఫిలిప్పీన్స్ మేధావుల్లో ఒకరు. ఆంగ్ల సాహిత్యాన్నీ, ఆర్థికశాస్త్రాన్నీ లోతుగా అధ్యయనం చేసారు. సోషియాలజీ, పొలిటికల్ సైన్సు, ఆంగ్లం మొ॥ వాటిని అనేక విశ్వవిద్యాలయాల్లో బోధించారు. ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు నాయకుల్లో ఒకరు. 1977లో అరెస్టు చేయబడి అనేక చిత్రహింసలకు గురయ్యారు. పదేళ్ళ జైలు శిక్ష తరువాత 1986 సంవత్సరాంతంలో మార్కోస్ ప్రభుత్వ పతనానంతరం విడుదలయ్యారు.)

ప్రజాసాహితి, నవంబర్ 2001

ఒక తల్లిగా ఉండడం గురించి

- చెలాన్‌వియెన్

అదంత సులభం కాదు

వియత్నాంలో ఒక తల్లిగా వుండడమనేది అంత సులువు కాదు

ప్రపంచంలో యితర దేశాల్లోని తల్లులు

'పూలను ప్రేమించండి' అంటూ తమ పిల్లలకి

పలు విషయాలు నేర్పిస్తారు

ఇక్కడో... పిల్లలు అదనంగా నేర్చుకోవాల్సింది

తుపాకీ పేలింతర్వాత చేయవలసింది ఏమిటా అని!

ప్రపంచంలో యితర దేశాల్లోని తల్లులు

సంగీతనాదం గురించీ, పక్షుల పాటల గురించీ

తమ పిల్లలకు పాఠాలు పాఠాలుగా నేర్పిస్తారు

ఇక్కడో...బి-ఫిఫ్టీటూ విమానాల మోత గురించీ

ఎఫ్-వన్నాటు ఫైవ్‌శబ్దాల గురించీ

పిల్లలకు తెలియచెప్పాలి

ఓ నా పరమ పవిత్ర మేరీ మాతా!
పందొమ్మిదొందల అరవై తొమ్మిది ఏళ్ళు
నీ కొడుక్కి పాలిచ్చి పెంచావే
నీకు తెలుసా?
మా దేశంలో మాసాల తరబడి
తల్లులు తమ పిల్లల్ని వదలి
బహుదూరంలో నిద్రించాల్సి వచ్చిందని!

'మనుషులుగా బతకడమెలా?' అని
తమ పిల్లలకు తల్లులు నేర్పించిన కాలాలూ, రోజులూ వున్నాయి
కానీ... అవి మాత్రమే సరిపోని కాలాలూ, రోజులూ వున్నాయి
'వీరులుగా బతకడమెలా?' అని
పిల్లలు నేర్చుకోవాల్సిన కాలాలూ, రోజులూ వున్నాయి.

(చెలాన్ వియెన్ 1920లో మధ్య వియత్నాంలో పుట్టిన యితడు తన 16వ ఏట కవిత్వం రాయడం ప్రారంభించాడు. విప్లవానంతరం తమ దేశం అనుభవించిన వైభవం గురించి పలు కవితలు రాశాడు)

ప్రజాసాహితి, డిసెంబర్ 2001

బ్రిటిష్ సైనికునికి ఒక ఉత్తరం

– పాట్రిక్ గాల్విన్

సైనికుడా!
ఇక్కడికి రావాలని నువ్వు మాలో ఏ ఒక్కరినీ అడగలేదు
ఆ విషయం మాకు తెలుసు
నువ్వు పాలకవర్గాల ఆజ్ఞలను తు.చ. తప్పక పాటిస్తున్నావు
ఆ విషయమూ మాకు తెలుసు
నీకు ఒక భార్యా
ఒక ప్రేయసీ
ఒక తల్లీ వున్నారు
అది కూడా మాకు తెలుసు
నీకు పిల్లలున్నారు
ఆ విషయం సైతం మాకు తెలుసు
కానీ సైనికుడా!
ఎక్కడ నువ్వు నిలుచుని వున్నావో
అక్కడే నీకు చావు తప్పదు
ఎక్కడ నువ్వు నిద్రిస్తున్నావో
అక్కడే నీకు ప్రశాంతత లేదు

ఎక్కడికి నువ్వు నడక సాగిస్తున్నావో
అక్కడే నీకు ఏర్పడుతాయి బలమైన గాయాలు

సైనికుడా!
నువ్వు చస్తే కుక్కలే నిన్ను పూడుస్తాయి
మా ప్రాంతానికిక నువ్వు వచ్చినప్పుడు
మా గురించీ, మా ప్రాంతం గురించీ
తెలుసుకోవడానికి వచ్చానన్నావు
సైనికుడా! నువ్వు తెలుసుకోవడం అనేది
మాకు విసుగునీ కోపాన్నీ కలిగిస్తోంది
మా ఐరిష్ మట్టిలో వున్నమీరూ, మీ బ్రిటిష్ సైన్యాలూ
అర్ధరాత్రి అపరాత్రీ అనకుండా తలుపుల్ని తట్టడాలూ
మా తలల మీద మోదే మీ తుపాకులూ
చెరసాలలూ బాష్పవాయు ప్రయోగాలూ
మా దేహపు రహస్యాంగాల్లో మీ తన్నులూ, దెబ్బలూ...
అన్నీ మాకు విసుగునీ కోపాన్నీ కలిగిస్తున్నాయి

సైనికుడా!
అస్థిపంజరాలైపోయిన మా ఐరిష్ ప్రజలకు
నువ్వు అందించే ప్రశాంతత, కల్గించే శాంతిభద్రతలు
మాకు విసుగునీ కోపాన్నీ కలిగిస్తున్నాయి
మా యిళ్ళని మీరు నిర్దయగా పేల్చివేయడాలూ
చిరకాల మిత్రుల్ని నిలువునా కూల్చివేయడాలూ
అశ్రుజలధారలూ, అంత్యక్రియలూ
అన్నీ... మాకు విసుగు పుట్టిస్తున్నాయి

సైనికుడా!
మా ఈ ప్రాంతానికి నువ్వు వచ్చినప్పుడు

మా గురించీ, మా ప్రాంతం గురించీ
తెలుసుకోవడానికి వచ్చానన్నావు
ఇదేనా నీ తెలిసికోవడం?
జాగ్రత్త! మేమిక్కడ కలలు కంటున్నాం...
ఈ భూమి మాదే అని కలలు కంటున్నాం.
కాథలిక్కులూ ప్రొటెస్టంట్లూ
ఆస్తికులూ వీరనాస్తికులూ
ఏదో ఓ రోజు అందరం కలిసి
ఐరిష్ పురుషులై ఐరిష్ స్త్రీలై కలలు కంటాం

మరణమే ఎరుగని ఒక పచ్చని నేల గురించి
దిగి వచ్చే ఒక నిశ్శబ్దం గురించి
ప్రశాంతత అనే నిశ్శబ్దం గురించి
మేం కలగంటున్నాం
మేం ఈ కలగనడానికి
సైనికుడా!
నీ అవసరం లేదు
అదే మేము మమ్మల్ని మేము తెలిసికోవడం
వెళ్ళిపో సైనికుడా! ఇంటికి వెళిపో!
నువ్వు యిక్కడ వుండటమూ
మా గాలిని గాయపర్చడమే కాదు...
నీ చిరునవ్వులు కూడా
మమ్మల్ని నిలువునా అతలాకుతలం చేస్తున్నాయి
వెళ్ళిపో సైనికుడా! ఇంటికి వెళ్ళిపో!!
నిన్ను పీనుగులా నీ యింటికి మేం
పంపడానికన్నా ముందే వెళిపో! వెళిపో!! తొలగిపో!!!

– *ప్రజాసాహితి, జనవరి 2002*

ఎడబాటు

-షెర్కోబెకాస్

నా కవిత్వంలోంచి
నువ్వు పూలను పరిహరిస్తే
నా ఆయువుపట్టుల్లో ఒకటి ఆరిపోతుంది
నువ్వు ప్రేమను తొలగిస్తే
నా ఆయువుపట్టుల్లోంచి రెండు జారిపోతాయి
నువ్వు రొట్టెను లాక్కుంటే
నా ఆయువుపట్టుల్లోంచి మూడు వూడిపోతాయి
నువ్వు స్వేచ్ఛని అపహరిస్తే
నా ఆయువుపట్టు నాలుగూ పాడవుతాయి -
వాటితోపాటే నేను కూడా సుమా!

(షెర్కోబెకాస్ : ఇతడు కుర్దిస్ ప్రసిద్ధ కవి ఫైక్ బెర్గాస్‌గారి కొడుకు. 1940లో జన్మించిన యితను దక్షిణ కుర్దిస్థాన్‌లో (ఇప్పుడిది ఇరాక్‌లో వుంది) పాకిస్తాన్‌లోనూ విద్యనభ్యసించాడు. కుర్దిష్ జాతీయోద్యమంలో పాల్గొన్న కారణంగా పాలకుల ఆగ్రహానికి గురై ప్రస్తుతం స్వీడన్‌లో వున్నాడు)

- ప్రజాసాహితి, ఫిబ్రవరి 2002

అమ్మాయి కావాలా... అమ్మాయి?

-తస్లీమా నస్రీన్

అమ్మాయి కావాలా... అమ్మాయి?
దబ్బపండులాంటి అమ్మాయి
మాంచి ఎత్తైన పొడగరి అమ్మాయి
పిరుదుల దాకా తాకుతోన్న
కేశ సంపదగల అమ్మాయి
నాజూకైన నడుము
నిండైన యవ్వనంతో నిగనిగలాడే శరీరం
గుండెల మీద గుండ్రటి కందరాలు
చక్కటి అమ్మాయి
ఆమెకి ఉప్పు, నూనే ఏవీ అక్కర్లేదు
ఆమె చర్మమ్మీద కించిత్తు మచ్చలేదు
చూసుకోండి... బాగా చూడండి!
ఆమె ముక్కుని కుట్టించారు...
రంధ్రాలున్నాయి చూడండి
చెవులక్కూడా ఛిద్రాలున్నాయి... చూసుకోండి

ఆమె...

ఒంపుసొంపులతో సంపూర్ణంగా తయారై వున్న స్త్రీ

కొనేటప్పుడు కుండను కొట్టి చూసుకున్నట్లు

ఒకటికి రెండుసార్లు చూసుకోండి...

ఎక్కడా ఓడు పోలేదు... కల్తీ లేదు...

ఇప్పటిదాకా ఆమె కన్నెపొర నెవరూ చించలేదు

ఇప్పటిదాకా ఆమె శరీరంతో ఎవరూ ఆడుకోలేదు

అమ్మాయి కావాలా... అమ్మాయి?

చాలు... రెండు మూడు పూటలు

ఇష్ట మృష్టాన్నాలు పెడితే చాలు

అన్నట్లు... ఆమె నుదుటి ఆకాశమ్మీద ఓ లక్ష రాసి వుంది

ఆమె ముఖమ్మీద

చీరలూ, నగలూ, సకల సామగ్రీ యిస్తారన్న గ్యారంటీ వుంది

అవన్నీ తీసుకోండి...

ఆమె స్నానానికి అవసరమైన సబ్బులుకూడా యిస్తారు

పుచ్చుకోండి!

ఆమె కళ్ళెప్పుడూ నేల చూపులే చూస్తాయి... ఆనందించండి

గొంతు శ్రావ్యంగా, శాంతంగా వుంటుంది... విని చావండి

ఒక్క ముక్కలో ఆమె అపరంజి బొమ్మేకాదు

సిగ్గుల మొగ్గ కూడా!

ఒకేసారి ఏడురకాల రుచికరమైన వంటకాలు

వండి పెట్టగల్గిన సమర్థురాలు ఆమె

మనసుకు నచ్చినట్లు, ఇష్టం వచ్చినట్లు వాడుకోవడానికి

పనికొచ్చే పనిముట్టు కదూ స్త్రీ అంటే...!

మీకు అనిపిస్తే చాలు

కాళ్ళూ చేతులకే కాదు

ఆమె మనస్సుక్కూడా సంకెళ్ళు వేయవచ్చు

మీకు ఉన్నపళంగా గుర్తుకొస్తే చాలు

విడాకులివ్వవచ్చు

చేయాల్సిందల్లా... ఇల్లా అనటమే

కాకుంటే మూడుసార్లు

తలాక్... తలాక్... తలాక్!

(తస్లీమా నస్రీన్ : తస్లీమా అనగానే గుర్తుకొచ్చే నవల లజ్జ. బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత బంగ్లాదేశ్‌లోని అల్ప సంఖ్యాక హిందువుల మీద జరిగిన దాడి ఈ నవలకు యితివృత్తం. తస్లీమా అనేక కవితలు కూడా రాసింది. మత ఛాందసవాదులకు యివేవీ రుచించక ఫత్వా జారీ చేశారు. ప్రస్తుతం తస్లీమా స్టాక్‌హోమ్‌లో వుంటోంది.)

– ప్రజాసాహితి, మార్చి *2002*

మధురమైన నీ ఉత్తరం...

-బ్రెయ్‌టన్ బ్రెయ్‌టన్ బాహ్

మధురమైనది నీ ఉత్తరం
ఒక పువ్వుకి సంబంధించిన భావనలకన్నా
మహోన్నతమైనది నీ ఉత్తరం
మన కల తోటలోని మట్టికి సంబంధించి వున్నంత వరకు
మహా సున్నితమైనది నీ ఉత్తరం

మిత్రమా!
నీ ఉత్తరం చదువుతున్నప్పుడు
ఆకాశం విశాలమవుతోంది
పచ్చిక బయళ్ళకి అవతలి నించి
మాట విచ్చుకుంటోంది

నేను పచ్చని మైదానాల్లో నిద్రించాను
రాత్రి పహారా సమయంలో
మరణశిక్ష విధించబడ్డ ఖైదీలు

పాతాళ గదిలోకి పిలువబడ్డప్పుడు
వాళ్ళేం పాడుతున్నారో చెవులొగ్గి వింటూనే
మృత్యుఛాయల లోయల
అంచులపై మేను వాల్చాను

నోట్లో వూపిరిని నోట్లోనే నొక్కిపట్టినట్లు
తగలబడిపోతోన్న మహానగరాన్ని వదిలివెళ్ళే నగరవాసుల్లా
వాళ్ళు ఎంత బాగా గొంతెత్తి పాడుతున్నారు
శృంఖలాబద్ధమైన ఊపిరితోనే
ఎంత చక్కగా పాడుతున్నారు వాళ్ళు
చీకట్లోంచి వెలుతురువైపు మళ్ళుతున్నవాళ్ళు
దేనికీ తొణకని బెణకని
కులశైలాల్లాంటివాళ్ళు
మిత్రమా!
శత్రువులున్నంత వరకు
నా ముందున్న మేజా మీద
ఏదీ కనబడ్డం లేదు
నాతల మీద బూది
నా కప్పులేమో ఖాళీ
సూర్యునితో తలుక్కుమన్న
మన చిన్ని నారింజ చెట్టు
తెల్లగా విరగబూచిందా... చెప్పు మిత్రమా!
ఇంకా ఇలాంటిలాంటి
ఎన్నెన్నో ముచ్చట్లు విందామని
నీ వుత్తరం కోసం ఆఘమేఘాల మీద వచ్చాను

మేడ మీద నారింజపూల వాసనను
నేను కిందినించే గుర్తుపట్టగల్గుతున్నాను
నిన్ను సైతం నేను ఆఘ్రాణించగల్గుతున్నాను.

ఈ జడీభూతమైన రాత్రిపూట
నీ మాటల ఆకాశంలో
తేలిపోతాను... వేలాడిపోతాను
నా జీవన పర్యంతం
నీ వుత్తరంలో బతికేందుకు అనుమతించు
మిత్రమా!

మధురమైంది నీ వుత్తరం...
ఒక పువ్వుకి సంబంధించిన భావనలకన్నా
సున్నితంగా విచ్చుకుంటోంది
మనిద్దరి కల తోటలోని మట్టికి
సంబంధించినదై వుండాలి సుమా!

నీ ఉత్తరంచదువుతున్నప్పుడు
ఆకాశం విశాలమవుతోంది
ఊహలకు ఆవలి తీరాల నించి
మాట విచ్చుకుంటోంది

- ప్రజాసాహితి, ఏప్రిల్ 2002

గుర్తింపు కార్డు

-మహమూద్ దర్వేష్

రాసుకో...
వివరాలు చెప్పుతాను
నేనొక అరేబియన్‌ని
నా గుర్తింపు కార్డు నంబర్ యాభై వేలు
నాకు ఎనమండుగురు పిల్లలు
రానున్న వేసవికి తొమ్మిది మంది అవుతారు
ఇంతకీ నీకెందుకు కోపం?

రాసుకో...
వివరాలు అందిస్తాను
నేనొక అరేబియన్‌ని
నాకొక పేరుంది... డిగ్రీ లేదు
కోపంతో మండిపోతున్న ఈ మట్టిలో
సహనంతో బతుకు ఈడుస్తున్న వాణ్ణి
నా వేళ్ళు...

నాగరికతలు ఉదయించక ముందు
ఆలివ్ వృక్షాలూ, సైప్రస్ చెట్లూ ఆవిర్భవించక ముందు
యుగాలకు ఆవల, కాలానికి ఆవల
లోతుగా పాతుకున్న కుదుళ్ళలో వున్నాయి
నా తాత ముత్తాతలంతా
నాగలి భుజాన వేసుకుని దున్నిన వీర యోధులు
మెట్ట భూమిలో పుట్టినవాళ్ళు కాదు
నా తాత రైతు కుటుంబంలోంచి వచ్చిన వాడు
ఘనత వహించిన రాజవంశాల్లో పుట్టిన వాడు కాదు
పుల్లలతో పూరితో కప్పబడిన
చిన్న గుడిసె నా యిల్లు
తండ్రి ద్వారా ఆస్తి సంక్రమించే
పితృస్వామ్యం కాదు ఆమది

రాసుకో...
వివరాలు ప్రకటిస్తాను
నేనొక ఆరేబియన్ని
తల వెంట్రుకల రంగు : నలుపు
కళ్ళు : మట్టి రంగు
గమనించదగ్గ అంశాలు :
కఫియమే అనే తలపాగా
తలను బాగా పట్టుకుని వుంటుంది
చిరునామా :
విస్మృతమైన ఓ సుదూర గ్రామం
వీధులకు పేర్లు లేని గ్రామం

మా ఊళ్లోని మగవాళ్ళంతా
పొలాల్లో పని చేస్తున్నారు
రాళ్ళు కొడుతున్నారు
ఇంతకీ నీకెందుకు కోపం?

రాసుకో...
వివరాలు యిస్తున్నాను
నేనొక అరేబియన్ని
నా కుటుంబానికి చెందిన పళ్ళతోటని
నేనూ నా యింటిల్లిపాదీ దున్నే పొలాన్ని
నువ్వు క్షణంలో తస్కరించావ్
నా మనుమలూ మనుమరాళ్ళకి
నువ్వు వుత్త రాళ్ళు వదిలావ్
నువ్వు చెబుతున్నట్లు కొన్నాళ్ళకి
వాటిని కూడా మీ ప్రభుత్వం కబ్జా చేసుకుంటుందా?
అయినా...

రాసుకో!
మొదటి పేజీలో... మొదటే...
నేనెవరినీ అసహ్యించుకునే వాణ్ణి కాను
ఎవరి నేలమీదా హద్దు మీరి నడిచేవాణ్ణి కాదు
కానీ... నేను ఆకలితో నకనకలాడుతున్నప్పుడు
నా కాళ్ళ క్రింది మట్టిని అపహరించిన వాళ్ళ కండరాల్ని
గుటకాయ స్వాహా చేసేవాణ్ణి
హడలి పో

నా ఆకలిని చూసి!

అదిరి పో

నా ఆగ్రహాన్ని చూసి!!

(మహమూద్ దర్వేష్ : పాలస్తీనాలోని పిర్వా అనే గ్రామంలో 1941లో జన్మించాడు. 1948లో ఇజ్రాయిల్ వలసవాద ప్రభుత్వం ఏర్పడ్డాక వాళ్ళ గ్రామం నేటమట్టమైపోయింది. దర్వేష్ కుటుంబం మొదట లెబనాన్‌కు పారిపోయింది. తర్వాత ఆక్రమిత పాలస్తీనాలోని కలీలి అనే ప్రాంతానికి వచ్చింది. దర్వేష్ మొదటి కవితా సంపుటి తన 19 ఏట వచ్చింది. 1971లో కైరో వెళ్ళి అక్కడ కొన్నాళ్ళు వున్నాడు. 1972లో లెబనాన్ రాజధాని బీరూట్‌కు వెళ్ళి పిఎల్ఓలో పని చేశాడు. తర్వాత లెబనాన్ మీద ఇజ్రాయిల్ కన్నెర్ర చేసిన కారణంగా బీరూట్‌ని వదిలి వెళ్ళాడు. పాలస్తీనాలో సంస్కృతీ నాగరికతల గురించి చాలా కాలం పనిచేశాడు).

– ప్రజాసాహితి, మే 2002

ఓ కథ

– కిష్వర్ నహీద్

ఒక కీలుగుర్రమ్మీద
ఓ పిల్లవాడు హాయిగా ఆడుకుంటున్నాడు
అది కొయ్యగుర్రం
దానికి పిల్లవాడి స్పర్శ తెలియదు
పిల్లవాడేమో గుర్రాన్ని కొడుతున్నాడు
తన సామర్థ్యాన్ని చూసుకొని
తనను తానే పొగడుకుంటున్నాడు
అతడు పెరిగి పెద్ద వాడవుతున్నాడు
కొయ్యగుర్రమ్మీద మరలా సవారి చేస్తున్నాడు
శోభనం పేరిట
తన యవ్వనాన్ని ప్రదర్శిస్తున్నాడు
తెల్లవారేసరికి
గుర్రం తన రూపాన్ని మార్చుకుంటోంది
మరలా కొయ్యగుర్రం సిద్ధం
గుర్రాన్ని కొట్టి అదలిస్తున్నవాడూ

తన్ను తాను పొగడుకుంటున్నవాడూ

ఎన్నటికీ మారకుండానే వుండిపోతున్నాడు

యజమానిగానూ

సవారీ చేసేవాడిగానూ

మొగుడిగానూ

(కిష్వర్ నహీద్ : 1940లో పుట్టిన వీరు పాకిస్తానీ ప్రముఖ సాహితీవేత్తల్లో ఒకరు. అక్కడి ఆకాశవాణిలో అనౌన్సర్‌గా పని చేస్తున్నారు. అనేక సంచికలకు సంపాదకులుగా పనిచేయడమే గాక ఎన్నో కవితా సంపుటులు తెచ్చారు. స్త్రీల హక్కుల కోసం పోరాడుతున్నారు)

– *ప్రజాసాహితి, నవంబర్ 2002*

ఓ దేశాన్ని వెతుకుతూ...

– ఎల్వియో రోమేరో

ఆ ప్రాంతానికి మళ్లీ వచ్చాను

వంతెనలో ఎలాంటి మార్పూ లేదు దాని యవ్వన కాలంలో నీళ్ళు

దాంతో రాగాలు ఆలపించాయి

అక్కడే కదూ... నేను నీ చేయి పట్టుకున్నది

అప్పుడే కదా... నా నీడలో నీ ఆనందాన్ని ఆలింగనం చేసుకున్నది

ఆ రోజుల్లో వంతెన –

మన బాటలో మనల్ని అనుసరించిన

ఓ పచ్చని రెక్కలా... ఓ చల్లని తల్లిలా కనిపించేది!

రాత్రి తన గుండె వూసుల్ని కరువుదీరా చెప్పుకున్న స్థలమిది.

పొదల్లోంచి వచ్చే ప్రతిధ్వనిని

అంతం లేని రాత్రిని, ఎవరిదో అయిన ఈలని

తలుపులకు వేసిన తాళం కప్పలో తిప్పబడే 'కీ' చప్పుడుని

మన అంతరంగాల ఆందోళనాభారిత స్పందనల్ని

ఇలా ఎన్నింటినో మనం పట్టుకోగలమనుకున్న స్థలమది.

పరాజితులంతా నిన్న దాటి వెళ్ళిన ఈ వంతెనని

రేపు నిశ్చయంగా మళ్ళీ దాటుతారు
అప్పుడు వాళ్ళ చేతుల్లో జెండాలే జెండాలు
పెదాల మీద పాటలే పాటలు
వాళ్ళు గతంలో తలదించుకుని నడిచినట్లు కాక
పునర్జన్మ సిద్ధించినట్లు
తలెత్తుకుని విజయగర్వంతో నడిచివెళతారు
అప్పుడు వాళ్ళ చేతుల్లో ఉదయకాల ప్రకాశమూ
విశ్వాస నక్షత్రమూ
బాల భానుడి బంగరు కిరణాలూ కలగలిసి వుంటాయి
నీతో స్నేహం చేసిన ఆ వంతెన మీదే...
ఏ మాత్రమూ మారని ఆ వంతెన మీదే...
నా నీడని నీ ఆనందం
ఆలింగనం చేసుకున్న ఆ వంతెన మీదే...

(ఉరాగ్వేలో జనరల్ స్ట్రాస్‌నర్ పరిపాలనలో కమ్యూనిస్టు పార్టీని నిషేధించాక ఎల్వియో రొమేరో అర్జంటైనాలో ఆశ్రయం తీసుకున్నారు. 1986లో మాతృదేశానికి తిరిగి రావడానికి అనుమతించబడినా ఆ దేశ ప్రభుత్వం వల్ల పలువిధాల బాధలకు లోనయ్యారు. మళ్ళీ అర్జంటైనా వెళ్ళిపోయారు.)

– *ప్రజాసాహితి, డిసెంబర్ 2002*

కారల్ మార్క్స్

–నారాయణ్ సుర్వే

అది నేను మొట్టమొదటిసారిగా పాల్గొన్న సమ్మె
అప్పుడు నా చేతుల్లో అరుణపతాకం వుంది
ఆ సమ్మె ఊరేగింపులోని జానకి అక్కయ్య
“అదుగో... కనిపిస్తున్నాడు చూడూ!
అతగాడే, మన మార్క్స్, మన తండ్రి
జర్మనీలో జన్మించాడు, పలు పుస్తకాలు రాశాడు
ఇప్పుడతని చిరునామా ఇంగ్లండు మట్టి
ఎంత గొప్ప మహానుభావుడాయన!
అన్ని దేశాలూ అతనికి సమానమే
నీలాగే అతనికీ భార్యా పిల్లలున్నారు” అంది

ఆ తర్వాత చాన్నాళ్ళకు
“ఎందుకీ దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ?
వీటికి మూలకారణం ఏమిటో తెలుసా?”
అంటూ నేను ఓ సభలో ప్రసంగిస్తున్నాను

అప్పుడు కూడా మార్బ్ మళ్ళీ వచ్చి
"నేను చెబుతాను" అని మొదలెట్టి
కడదాకా ఆపకుండా మాట్లాడాడు

మరొక సందర్భంలో
నేను మరో సభలో
"ఇంక చరిత్ర నిర్ణేతలం మనమే!
ఈ ధరిత్రి నిర్మాతలం మనమే!!" అని
ఉపన్యసిస్తున్నపుడు శ్రద్ధగా చెవులొగ్గి విన్నాడు
మొదట చప్పట్లు చరిచింది కూడా అతనే
నిష్కల్మషంగా నవ్వుతూనే నా భుజమ్మీద చేయి వేసి
"అద్భుతం... అపూర్వం...
నువ్వు కవివా ఏం?
నాకు కవిత్వమంటే ఆరోప్రాణం
గెథే నా అభిమాన కవి" అంటూ
క్షణాల్లో అక్కణ్ణించి అంతర్ధానమయ్యాడు

(నారాయణ సుర్వే ప్రసిద్ధ మరాఠా దళిత కవి)

- ప్రజాసాహితి, మార్చి 2003

ముప్పైవేల మంది రైతులు

-మెర్సిడెస్ డ్యురాండ్

ముప్పై వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం విని కూడా
అతనలా తన కుర్చీలో వెనక్కి వాలి కూర్చున్నాడు
ఆనాటి అతని రాత్రి భోజనం
మూలికల రసం, వేపుడు పుచ్చపూలు, నిమ్మ పులుసు...
అతనొక థియోసాఫిస్టు... ఎప్పుడూ శాకాహారమే తీసుకుంటాడు
అణగారిన నాగరికతల గురించే పరిశోధిస్తాడు
అందమైన గాజుకుప్పెల్లో
నీళ్ళు నింపి సూర్యరశ్మిలో వుంచి వేడుక చూస్తుంటాడు
చీమ, దోమ, సాలీడులాంటి చిరుజీవులు చనిపోతే కూడా
విలవిల్లాడిపోతాడు
కానీ...
ముప్పై వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం విని కూడా
అతనలా తన కుర్చీలో వెనక్కి వాలి కూర్చునే వున్నాడు
ఇప్పటిదాకా అతనెవరినీ తలెత్తి నేరుగా చూడనేలేదు
అతనికి తటస్థించిన వాళ్ళిద్దరే!... ఒకరు హిట్లర్! మరొకరు ముస్సోలినీ!

('మెర్సిడెస్ డ్యురాండ్ కవయిత్రి. ఎల్‌సాల్వడార్‌లో గతి తప్పుతున్న పరిస్థితుల గురించీ, శ్రుతి తప్పిన ప్రభుత్వ విధానాల గురించీ ఎంతో కవిత్వం రాశారు.)

- ప్రజాసాహితి, ఏప్రిల్ 2003

కన్ఫెషన్ స్టేటుమెంటు

-రెనే దెపెస్త్రే

గొడ్డువోయిన హామీలను గుప్పించి గుప్పించి
వాళ్ళు నా గతకాలంతో జూదమాడుకున్నారు
నా చొక్కాను చిరుగులు చేశారు
దేనినీ ఎదిరించలేని నా లాంటి నిస్సహాయుల మౌనం
మా వేదనల్లోంచి దూసుకు వెళిపోయింది
వాళ్ళు వలసవాదానికి ఊపిరులూదారు
నేనే ముందుకొచ్చి శరణాగతుణ్ణి అయ్యేలా
నా అణువణువునూ
వాళ్ళు సూది మందులివ్వడానికి వేనవేల వ్యూహాలు రచించారు
కానీ తర్వాతర్వాత
నాకు నిజాలు తెలిసొచ్చాయి
ఇప్పుడు నా గాయాలు మానడానికి
పచ్చి ఆకుల అవసరం లేదు
వెచ్చని స్పర్శలు అవసరం లేదు
ఏ మత్తుమందూ అవసరం లేదు

వేడెక్కిన కట్లు తెంచుకున్న
నా నమ్మకం
చరిత్ర పుటల్లో యిప్పుడు అగ్నిపర్వతాలు దొర్లిస్తున్నది
హామీలు, పచ్చి ఆకులు, వెచ్చని స్పర్శలు
మత్తుమందు, దూరంగా గిరాటేసిన చొక్కా చిరుగులు
అన్నీ సత్యమనే సమ్మెటపోటుతో
నలిగిపోయిన నీడలు
పోరాడి గెలుచుకోవడమే మంచిది
నా ఆరాటాన్ని, నా నమ్మకాన్ని, నా శక్తిని
కమ్మరి కొలుముల్లో కరిగించడమే మంచిది
అప్పుడే... అప్పుడే...
నా ఉడుకు నెత్తురు
ఈ పాడు ప్రపంచమ్మీదపడి ఉరకలేస్తుంది

రెనే దెపెస్త్రే : హైతీలో ప్రసిద్ధ కవి. వామపక్ష ఉద్యమాలతో సంబంధాలున్నాయని అక్కడి ప్రభుత్వం రెండుసార్లు దేశ బహిష్కార శిక్ష వేసింది. 1959 నుండి క్యూబాలోనే వుంటున్నారు.

– ప్రజాసాహితి, జూన్ 2003

శవ పరీక్ష

-నీరవ్ పటేల్

అతని బొడ్డులోంచి పునుగూ, జవ్వాజి లాంటివేవీ వాళ్ళకు దొరకలేదు
అతని చర్మాన్ని అంగుళం అంగుళం ఒలిచినప్పటికీ
బంగరు రేకులాంటివేవీ వాళ్ళకు లభించలేదు
అతని బానలాంటి పొట్టలో నవరత్నాల్లాంటివేవీ వాళ్ళకు చిక్కలేదు
ముడతలు ముడతలుగా వున్న అతని మెదట్లో
పుణ్యవేదాల్లోని ఒక్క కాయితమ్ముక్కని కూడా వాళ్ళు
కనుక్కోలేకపోయారు
అతని కలేజాలోంచి
సూర్యవంశానికి సంబంధించిన ఒక్క ఆనవాలు కూడా
వాళ్ళు ఆరా తీయలేకపోయారు
అతని విషపూరిత హృదయంలో
పుణ్యకార్యాల తాలూకు అమృత బిందువొక్కటయినా లేదు
ఖండ ఖండాలుగా అతణ్ణి చీరి పారేసినప్పటికీ
అతని సిక్స్ సెన్సు ఎక్కడా గోచరించలేదు
అవును... అతని గుండెల్లో వున్నదంతా
ఒక అందమైన గుంటనక్క హృదయమే!
అతని వేళ్ళ కొసల్లో పదును గల్గిన గోర్లు
తెల్లగా తళతళ మెరిసే అతని పళ్ళలోంచి
భయంకరమైన ఈటెల్లాంటి కోర పండ్లు
అతని అందమైన కళ్ళలో మొసలి కన్నీరు
అతని నియమ నిష్ఠాగరిష్ఠ పరిష్ఠ రక్తనాళాల్లో
ముక్కుపుటాల్ని బద్దలు కొట్టే సారాయి కంపు
అవును...ఇదే యిదే యిప్పటివరకూ మనల్ని ఊదరగొట్టిన
ఆర్యపుత్రుని శవపరీక్ష

నీరవ్ పటేల్ గుజరాతీలో ప్రసిద్ధ దళిత కవి.

- ప్రజాసాహితి, జూలై 2003

నాకో చీపురు కావాలి

-చంద్రకాంతి

"ప్రియా!" అంటూ ఎప్పుడూ

నా చుట్టే తిరుగుతున్నప్పుడు
అతనికి ఒక్క పైసా అక్కర లేకుండేది!
కానీ "నన్ను పెళ్ళి చేసుకోవూ!" అని నేననగానే
బంగారం, డబ్బులు, మంచాలు, గించాలు,
మొంటె, గంటెలాంటి వంటసామాన్లు
అన్నీ కావాలని ఏకరువు పెట్టాడు
చివరికి ఇల్లు ఊడ్వడం కోసం ఒక చీపురు కూడా కావాలన్నాడు
నేనేమో –
"చివరి కోరిక చీపురేనా?" అడిగాను
వాడు అవునంటూ లేచాడు
"హృదయంలోంచి శాశ్వతంగా నిన్ను
ఊడ్చి పెంటకుప్పలో పారేయడానికి
చీపురు నాకే కావాల'ని నేనన్నాను
ఉత్త చెత్తగాణ్ణీ, వట్టి దురాశాపరుణ్ణీ కట్టుకోవడానికీ
జీవితచందా రాసివ్వడానికీ నేనేమైనా పిచ్చిదాన్నా?

– ప్రజాసాహితి, నవంబర్ 2003

కవిత్వ కళ

-జేవియర్ హెరాడ్

నిజానికి –

ఉన్నదున్నట్లు స్పష్టంగా చెప్పాలంటే
కవిత్వం రాయడం ఆషామాషీ పని కాదు
అదొక కఠినాతికఠిన వ్యాసంగం
ఆకురాలు కాలపు విధ్వంసంలా
కవిత్వ విజయం ఓటమిలోనే వుంది

యవ్వనంలో అర్థాంతరంగా
నేలరాలిన పూలు
మాలగా ఒక్కచోట చేరనంతకాలం
కవి అశాంతిగా
రాత్రుళ్ళు మేలుకుని రాస్తూ వుంటాడు
కొన్నిసార్లు వందల కొద్దీ
తెల్లకాయితాలను నల్లగా చేస్తూనే వుంటాడు
"దారి పక్క సైప్రస్ చెట్లు రాల్చే వసంతకాలంలా

సహజంగానే నా చేతివేళ్ళ సందుల్లోంచి
కవితలు జాలువారుతున్నాయి
ఇక నా కవితల్ని సరిదిద్ద నవసరమే లేదు" అంటూ
అతగాడు విర్రవీగుతూ వుండవచ్చు
కానీ కాలం గడుస్తున్నకొద్దీ
దొర్లిపోయే ఏళ్ళూపూళ్ళూ
చెవుల పక్కన నెరిసిన వెంట్రుకల్ని మొలిపిస్తున్నపుడు
కవిత్వం -
కమ్మరి చేతిలోని పరిణత కళ అవుతుంది
అది ఆవములో కాల్చబడ్డ రేగడి మట్టి
నిప్పులో పుటం పెట్టబడిన నల్లరేగడిమట్టి

కవిత్వం ఒక అద్భుతమైన మెరుపు
మౌన శబ్దాలతో తయారైన వర్షం
గుండె చప్పుళ్ళతోటీ నిండువిశ్వాసాల తోటీ
తయారైన ఒక అరణ్యం
అణగారిన అన్నార్తుల గీతం
విముక్తి పొందిన ప్రజల కొత్తపాట
అందుకే కవిత్వం -
ప్రేమా, చావూ
విశ్వమానవాళి విమోచనమూనూ

జేవియర్ హెరాడ్ : పెరూ దేశ రాజధాని లిమాలో 1942లో పుట్టారు. 19 ఏళ్ళ వయస్సులో చలన చిత్ర కళను అభ్యసించడానికి క్యూబా వెళ్ళారు. క్యూబా విప్లవ ప్రభావంతో హెరాడ్ మాతృదేశానికి తిరిగొచ్చారు. పెరూ దేశ జాతీయ విముక్తి సైన్యంలో చేరారు. 1963లో ప్రభుత్వ సాయుధ బలగాలు అతణ్ణి కాల్చి చంపేశాయి.

- ప్రజాసాహితి, డిసెంబర్ 2003

దేశ చరిత్రలు

-యువాన్ సెల్మన్

ఏ దేశ చరిత్ర చూసినా
తేదీలూ, యుద్ధాలూ, శిలాశాసనాలూ
పొగడ్తలూ, వందిమాగధుల
"రాజాధిరాజ! రాజమార్తాండ!! లాంటి
మాటలూ.
మరి నేను చూస్తున్నదో-
గనిలో పనిలో
సారంగాలు తవ్వుతున్న చేతుల్ని
గుడ్డలు కుడుతున్న హస్తాలను
ప్రపంచ పరిమళాన్ని
సృష్టించే చేతుల్ని....
ఆ శ్రమజీవులిప్పుడు మన మధ్య
లేకపోవచ్చు
ఆ కరకమలాలను పూడ్చి పెట్టవచ్చు
కానీ ఆ చేతి వేళ్ళ గోర్లు మాత్రం
ఇంకా పెరుగుతూనే వున్నాయి.

యువాన్ సెల్మన్ : అర్జెంటీనాలో వామపక్ష ఉద్యమాలతో 1940 ప్రాంతాల నుండే సంబంధాలు కలిగి వున్నారు. లాటిన్ అమెరికా, ఆఫ్రికా, చైనా మొదలగు దేశాల్లో యువాన్ పర్యటించారు. తన కవిత్వానికి పరిపక్వత చైనాలోనే వచ్చిందని ఆయన చెబుతారు.

- ప్రజాసాహితి, జనవరి 2004

-ఇప్పుడు యింటికి వెళ్ళడం కష్టతరమైనది

-సుర్జీత్ పత్తార్

ఇప్పుడు యింటికి వెళ్ళడం చాలా కష్టతరమైన పని
మమ్మల్ని ఎవరు గుర్తుపడతారని?
నొసట మరణం తన చెరగని ముద్ర వేసి కూచుంది
ముఖంపై మిత్రులు తమ పాదముద్రలు విడిచి వెళ్ళారు
అద్దంలోంచి మరొక ముఖం
నన్ను వెక్కిరిస్తూ చూస్తోంది
ఓ పాడుబడిన యింటిచూరులోంచి
వచ్చే కాంతిలాగా
నా కళ్ళలో ప్రాణంలేని కాంతి ప్రకాశిస్తోంది
పాత మిత్రుడొకడు నన్ను కలవడంతో
వేనవేల జ్ఞాపకాలు సలుపుడు పెడుతున్నాయి
సాయం సంధ్యావేళలో
చితిమంటల చిటపటల్లో
గురుద్వారాలోని శంఖనాదంలో
కనుమరుగైన అమరవీరుల్ని నేను తలుచుకుంటున్నాను

ఈ సమయంలో వాళ్ళ మరణాల గురించి
తెలిసినవాణ్ణి నేను మాత్రమే మిగిలిపోయాను
వాళ్ళ గురించి ఏ ఒక్కరు ఆరా తీసినా
నేను నిలువునా కదిలిపోతున్నాను
ఎందుకంటే....
ఇప్పుడు నా మనస్సులో ఏకాంత భావన....ఒంటరితనం
ఒక శత్రుదేశంలోని గూఢచారిలా
ఇంటికి తిరిగివెళ్ళడం యిప్పుడు చాలా కష్టతరమైన పని.

సుర్జీత్ పత్తార్ : పంజాబ్‌లో మార్క్సిస్టు-లెనినిస్టు ఆలోచనా విధానంతో కవిత్వం రాస్తున్న వాళ్ళలో ముఖ్యుడు.

– ప్రజాసాహితి, ఫిబ్రవరి 2004

సాక్ష్యం

-ప్రతిభా శతపథి

ఇక్కడ వర్షం కుండపోతగా కురుస్తున్నది
కానీ యింకా ఎక్కడో ఒకచోట ఈ దేశంలో
నేలతల్లి పగుళ్ళు విచ్చుకునే నొచ్చుకునే వుంటాయి
ఏ అతిథికో నాలుక దాహంతో పిడుచగట్టుకొని పోతుంది
ఎక్కడో ఒకచోట ఈ దేశంలో
కనీసం చిటికెడు నీళ్ళు కూడా దొరక్క జనం తల్లడిల్లుతుంటారు
ఇక్కడి మనుషుల గుండెల పొరల కింద
చక్కని బురదా, మకిలీ, చీకటి చిక్కగా పరుచుకొని వున్నాయి
వీళ్ళంతా రోడ్లమీద పాకుతోన్న పురుగులూ, జలగలూ కదూ!
కానీ యింకా ఈ ప్రపంచం
పారిజాత సుమ పరిమళాలతో చెమటలు కక్కుతున్నది
కాంతి కిరణాల సెలయేళ్ళు
మేఘపర్వతాల మీంచి అమాంతం దూకుతాయి
సాలవృక్షాల అరణ్యాలు దుల్చిన
ఆకుల పడకమీద

వరి ధాన్యాల, ఆవగింజల నీడలు మేనువాల్చుతాయి
భూమి కళ్ళు విప్పుతున్నది అన్నట్లు.....
సూర్యుని కిరణాలు కూడా సోకని
ఒకానొక స్థలాన్ని మీరెప్పుడైనా చూశారా?
కలలోసైతం కదంబపుష్పం విచ్చుకోనని
మొరాయించే ఆ స్థలాన్ని మీరెప్పుడైనా దర్శించారా?
అతివృష్టితో ఒకవైపు దేశం అల్లాడిపోతుంటే
నీటిచుక్క కోసం నిరంతర తపస్సమాధిలో వున్న
అలాంటి స్థలానికి మీరెప్పుడైనా దయచేశారా?
నేను ఆ స్థలానికీ, దుర్భిక్ష ప్రాంతానికీ సజీవ సాక్ష్యాన్ని
నేనీ దురంతాన్ని చూడలేక నిలువునా నిలబడిపోయిన శిలని
పుట్టి పెరిగిన ఈ మట్టిమీది నా మమకారాన్ని చూసికూడా
ఈ నేలకు పూర్తిగా దాసోహం అన్న నా స్వభావాన్ని చూసి కూడా
ఏ ఒక్కరి హృదయం కరగకపోయినా
ఏ ఒక్కరి పెదాలూ కదలకపోయినా
ఏ ఒక్కరి కళ్ళు కన్నీళ్ళుగా మారకపోయినా
నేను ఏకైక సాక్షిని
ఈ దురంతాలకు నేను ఒంటరి సాక్షిని
మెదలు విరిచిన నా దుఃఖాక్షరాలను
ఎవరు మాత్రం పట్టించుకుంటారు?
నాకు నేను సాక్షిని.

– ప్రజాసాహితి, ఏప్రిల్ *2004*

చీర ఒక్కటే-అవతారాలు ఐదు

-రాజమురుగు పాండియన్

మా ఇంటి యజమానురాలి పాతచీర
మా అమ్మకు కొత్తచీర
మా అమ్మ కట్టుకుని విడిచిన ఆ చీరే
మా అక్కకు కొత్తచీర
అక్క కట్టుకొన్న ఆ చిరుగుల చీర
మా చెల్లికి మళ్ళీ కొత్త ఓణీ
చెల్లి విడిచి పారేసిన అదే ఓణీ
మా తమ్ముడికి సరికొత్త గోచి

– ప్రజాసాహితి, మే 2004

కిన్షాక్సీ

-అగస్టినో నెట్టో

ఉక్కపోత-సాయంకాలం-ఆరుగంటల వేళ
కిన్షాక్సీ నగరంలో ఓ బెంచీమీద
ఊరికినే అలా కూచోవడమంటే
ఎంత ఆనందం!

తమ దైన్యమూ, దారిద్ర్యమూ కనిపించేట్లు
బాగా మారిపోయిన మా మాతృభాషలో మాట్లాడుతూ
నా పక్కనే కూచోవడానికి
ఒకవేళ ఎవరైనా వస్తారేమో!
నేను నగరంవైపు వెళుతున్న వాళ్ళ నల్లని ముఖాల్ని చూస్తూనే వున్నాను
కష్టజీవుల తడబడుతున్న నడకని గమనిస్తూనే వున్నాను
వాళ్ళ తండ్రులూ, తాతలు సైతం కష్టజీవులే!

ఇప్పుడు నాలో ఆనందమూ లేదు, విచారమూ లేదు

సూర్యుడు వాలిపోయాక
దీపాలు వెలగక తప్పదు
నేను సైతం యిక్కణ్ణించి
మరో చోటికి కదలక తప్పదు
చలనం ఎవరికైనా తప్పదు
మన జీవితం ఎంత సరళమైనది!
అలసిసొలిసినా నడక తప్పదని గుర్తుచేసే
మన జీవితం ఎంత సహజమైనది!!

అగస్టినో నెట్టో: పోర్చుగీసు వారి వలసవాదం నుండి స్వాతంత్ర్యం పొందిన అంగోలా దేశపు ప్రథమ రాష్ట్రపతి ప్రఖ్యాత మార్క్సిస్టు మేధావి. స్వాతంత్ర్యం కొరకు సాయుధ పోరాటం చేసిన ఎంపిఎల్‌ఏ అనే పార్టీ సభ్యుడు.

– ప్రజాసాహితి, జూన్ 2004

పదచిత్రం 1971

–సైపుల్లా మహమ్మద్ దువాల్

పక్షుల కిలకలారావాలు–వీచే చల్లగాలి
కప్పల సామూహిక గిటార్ గాన కచేరీ
కాలింగ్ బెల్–తలుపులు తెరుచుకుంటున్న శబ్దం
గాజుల గలగలల సంభాషణ–షెహనాయ్ సుప్రభాత సుస్వరం

క్యాసెట్ మార్చుతున్న సవ్వడి
టిక్...టిక్...టిక్...చప్పుడు–కప్పు సాసర్ల పిచ్చాపా'టీ'
టెలిఫోన్–ట్రెయిన్–

రాత్రి–చిమ్మట పురుగుల కోరస్ రొద–కుక్కల రోదన–
మళ్ళీ కప్పల బృందగానం–
విషాద ఫ్లూటు వాదన–మంత్రముగ్ధ సంగీతపు వాన
వానలో తడిసిన జీపు యింటి ముందర ప్రత్యక్షం
మృగాల ఆగమనం–పిలుపులు
బూట్ల పదఘట్టనలు–ద్వారమ్మీద లాఠీ చరుపులు

పశుగర్జనలు-సముద్రపు ఆటుపోట్లు

అపశకునాలు-అరుపులు-హింసాకాండ-హాహాకారాలు

ఆర్తనాదాలు-పెడబొబ్బలు-కేకలు-వికటాట్టహాసాలు

భీతిల్లిన పిల్లల పరుగు

గ్లాజు భళ్ళున పగిలిన చప్పుడు

కాల్పులు-కుంభవృష్టి-ఉరుములు-మెరుపులు

- ప్రజాసాహితి, ఆగస్టు 2004

ఓ అమ్మాయీ! విను

-తస్లీమా నస్రీన్

వాళ్ళు-

నువ్వు నిదానంగా పడి వుండాలనీ

బిగ్గరగా నవ్వకూడదని

నోర్మూసుకు పడి వుండాలనీ చెబుతారు

వాళ్ళు-

నువ్వు ఇల్లు దాటి వెళ్ళరాదనీ, తల ఎత్తకూడదనీ

ఎప్పుడూ ఏడుస్తూనే వుండిపోవాలనీ చెబుతారు

మరి నువ్వేం చేస్తావో తెలుసా?

దిగ్గున దెబ్బతిన్న పాములా లేచి నించుంటావు

నిటారుగా వుండి దర్జాగా తలఎత్తి నించుంటావు

నువ్వు మాట్లాడుతావు, అనర్గళంగా మాట్లాడుతావు

యథేచ్ఛగా మాట్లాడుతావు, బిగ్గరగా మాట్లాడుతావు

వాళ్ళు తమ రెండు చేతులతో చెవులు మూసుకునేలా

అరచి గీపెట్టి మరీ మాట్లాడుతావు

దిక్కులు పిక్కటిల్లేలా మాట్లాడుతావు

వాళ్ళు నిన్ను ఛీ! సిగ్గు విడిచిన ఆడదని అంటారు
ఆ మాటలు వినిన నువ్వు నవ్వుకుంటావు
వాళ్ళు నీ నడవడి మంచిది కాదని బెదిరిస్తారు
ఆ మాటలు విని మరింత జోరుగా నవ్వుతావు
వాళ్ళు నిన్ను చెడిపోయిన దానివని హడలగొడతారు
నువ్వింకా జోరుగా నవ్వుతావు
వాళ్ళు నిన్ను నిర్దాక్షిణ్యంగా వేశ్య అంటారు
నువ్వు వెంటనే నీ నడుము కిరువైపులా చేతులుంచి
కాళ్ళు ఎడంగా పెట్టి నిటారుగా నించుని
అవును నేను వేశ్యనే అయితే మీకేమిటని బదులిస్తావు
వాళ్ళు నోళ్ళు వెళ్ళబడతారు. నిశ్చేష్టులై రెప్పవేయక చూస్తారు
నువ్వింకా ఏమంటావోనని భయంతో చెవులు మూసుకుంటారు
ఇందాకా ఇన్నేసి మాటలన్నవాళ్ళలో
మగ పురుగులుంటే వాళ్ళ గుండెలు దడదడ కొట్టుకుంటాయి
అలా కాక–ఇన్నేసి మాటలన్నవాళ్ళలో
ఆడవాళ్ళుంటే
వాళ్ళు కూడా నీలాగా వేశ్యలైపోవాలనీ
స్వేచ్ఛను అనుభవించాలనీ కలలుకంటారు

– *ప్రజాసాహితి, మార్చి 2006*

మణిపూర్ తల్లి

–సుబోధ్ సర్కార్

ఇవాళ నగ్నంగా లేచి నిలుచుంది మా మణిపూర్ తల్లి

ఈ తల్లి కళ్ళలోంచే నేను నా రెండు కళ్ళనూ పొందాను
ఆపాదమస్తకం అలరించే భాషను పొందాను
సుమధుర సరిగమల్ని పొందాను
నగ్నంగా లేచి నిలుచుంది మా మణిపూర్ తల్లి

ఆర్మీ, పోలీసులూ తమకేది ఆనందాన్ని కల్గిస్తుందో
దాన్నే చేస్తారు... కర్ఫ్యూ విధిస్తారు
చార్‌మినార్‌నూ తగలబెడతారు
ఎవరినీ ఏమీ అనలేము.. మాట్లాడే హక్కులేదు
నగ్నంగా లేచి నిలుచుంది మా మణిపూర్ తల్లి

ఆర్మీ జీప్ ఈ అవకాశం కిందే నడుస్తుంది
ఆర్మీ జీప్ 'సారే జహాఁసే' అంటూ సాగుతుంది
ఆర్మీ జీపులో అమ్మాయిలను కుక్కుతారు

ఆర్మీ జీపులోనే బొత్తాములు విప్పుతారు
ఆ అమ్మాయి ఒకవేళ ఇంటికి తిరిగొచ్చినా
ఆ అమ్మాయి ఈ ఆకాశం కిందే చచ్చినా
ఆమె పేరు మాత్రం పోలీసులు
తుడిచిపారేస్తారు
ఇంతకీ ఆమె యిల్లు ఎక్కడ?
ఇంఫాల్‌కు బయట ఏ ఊరు?
ఇవన్నీ రోజూ జరుగుతున్న తంతులే
ఉదాహరణకు ఎక్కడో ఓచోట ఓ యువతి పడి వుంటుంది
మరోచోట ఇంకో చెల్లి గల్లంతవుతుంది
అయితే ఆమె చున్నీ మాత్రం చెట్టుకి వేలాడుతుంది

ఇవాళ జూలై నెలలో రాష్ట్రం ప్రమాద సూచికను దాటింది
మణిపూర్ తల్లి లేచి నిలుచుంది
స్తన్యమిచ్చి పెంచిన కన్నతల్లులంతా లేచి నిలుచున్నారు
పుడమితల్లిని చూడండి...
ఆ తల్లి పాలిండ్ల మీద ఎన్ని నీలిరంగు సిరలో!
నీ తల్లే నగ్నంగా నిలుచుంటే ఎలా వుంటుంది మరి?

అస్సామ్ రైఫిల్స్ ఏ గేటు మూసివేస్తున్నదో
అది మాకు జన్మనిచ్చిన తల్లి పొత్తి కడుపు
నేను ఎక్కడైతే నిలుచున్నానో
అక్కణ్ణించే ఇవాళ గంగమ్మతల్లి
వేణ్ణీళ్ళతో గట్లొరసి ప్రవహిస్తున్నది
ఆ నదే మణిపూర్ తల్లికి కొంగ్రొత్త
సంకేతాలు పంపిస్తున్నది
ఇవాళ ఎక్కడ స్త్రీలు

సామూహిక నగ్న ప్రదర్శన చేస్తూ నడుస్తున్నారో
అక్కడ స్థల నాయకులై జలనాయకులై
ఖల్ నాయకులై మీరేం చేస్తున్నారు?
మీ తల్లి యితరుల కంటికి కూడా
తల్లిలా కనిపించాలని మీరు భావించడంలేదా?
ఈ తల్లులందరి మధ్యా నిలుచున్న
ఆ ముసలితల్లి మీ తల్లి కాదా?

– ప్రజాసాహితి, జనవరి 2005

రైతన్న

-నీలేశ్ రఘువంశీ

నింగిన తాకుతున్న పచ్చని పైరు
నిండు పంటరూపంలో ఇంటికొచ్చేసింది
అలికి పూతలు పెట్టిన యిల్లు
లోన చల్ల చేస్తున్న చప్పుడు
గోధుమ సూర్పిళ్ళ సుస్వరాల జోరు
ట్రాక్టర్‌పై చేతిలో సెల్‌ఫోన్‌తో రైతు
ట్రాలీనిండా ధాన్యపు బస్తాల బరువు
పండిన పంటకు
మార్కెట్లో లభించిన గిట్టుబాటు ధర
ఆడపిల్లల నవ్వులతో కళకళలాడిన యిల్లు
ఆహా!
రైతన్నదెంత ఆనందమయ జీవనం
టి.వి. ప్రకటనల్లో!!

- ప్రజాసాహితి,నవంబర్ 2004

పిల్లాడికి చరిత్ర నేర్పడం కోసం పెళ్లి

-మల్లికా సేన్ గుప్తా

మేము చరిత్ర నుండి-
మొదట మానవులు జావా మానవులుగానూ
క్రోమాన్యాక, నియాండర్తల్ మానవుల్లాగానూ
వుండేవాళ్లని నేర్చుకున్నాం
ఆ ప్రాచీన మానవులే
ప్రకృతితో జరిగిన యుద్ధంలో పోరాడి గెలిచినవాళ్ళు
ఆ ఆదిమ మానవులే
రాతి ఆయుధాలతో ఎలుగుబంట్లను చంపినవాళ్ళు
వాళ్ళే పగిలి బద్దలైన వెదురును చూసి
పిల్లనగ్రోవిలో రాగాలు ఊదినవాళ్ళు
ఈ మ్యాన్‌మేడ్ నాగరికతకు ఆద్యులు వాళ్ళు
ఆ "మానవులకు"
కనీసం నీడగానైనా
కేవలం తోడుగానైనా "మానవి'లు లేరట!
అయితేనేం...

పాలియోలిథిక్ మానవుడు
క్రమేణా "స్టోన్ ఏజ్ మ్యాన్" అయ్యాడు
ఆ తర్వాత అతనే లోహం చేతబూని
"ఐరన్ మ్యాన్"గా మారాడు
ఇలా ఆదిమ మానవులందరూ పురుషులని
మేము ఈ చరిత్రనుండే నేర్చుకున్నాం.

చిత్రం!
హిస్టరీ అంతా వీరోచిత పోరాటాల
"హిజ్‌స్టోరీయే"
చరిత్రలో స్త్రీల ప్రస్తావన లేనందువల్ల
అప్పట్లో స్త్రీలే లేరని అర్థం చేసుకోవచ్చు
జావా, నియాండర్తల్ మానవులంతా పురుషులే!
జావా పురుషుని గడ్డం లోంచి
నిక్షేపంగా నియాండర్తల్ పురుషుడొచ్చాడు
ఇక ఈ నియాండర్తల్ పురుషుడే
పుట్టిన పిల్లలకు స్తన్యమిచ్చి పెంచాడు
ఈ ప్రాచీన పురుషుల్లో ప్రతి ఒక్కరూ
ఈనాటి ఆధునిక పురుషులయ్యారు
పురాతన కాలంలో ఆడవాళ్ళు లేనట్లు
ఆధునిక పురుషుల్లో
ఏ ఒక్కరూ మానవుల్లేరు
ఉన్నదల్లా పురుషులు...పురుగులు...మగ మద మృగాలు

అయితేనేం...

అప్పట్లో పురుషుడే భగవంతుడై, భగవతీ
తల్లీ, తండ్రీ
పాటా, ఫ్లూటూ.... అన్నీ పూటుగా పురుషుడే!
పురుషుడే స్వయాన లింగమూ, స్త్రీ జననాంగమూ
పురుషుడే బీజమూ, క్షేత్రమూ
ఇప్పటిదాకా చరిత్ర నుండి
మనం ఇలాంటి పాఠాలే నేర్చుకున్నాం
చివరికి నాకనిపిస్తున్నదేమిటంటే
ఈ హిస్టోరియన్లూ
హిజ్ స్టోరియన్లూ అంతా హిజ్‌డాలని.

– ఆకాశంలో సగం(కవిత్వం)

దాంతో ఏమిటీ

-జ్ఞానకూత్తన్

పాడమన్నప్పుడు
సిగ్గుపడుతున్నారు
ఆటలాడండి అన్నప్పుడు
సంకోచిస్తున్నారు
నటన చూపండి అన్నప్పుడు
సందేహిస్తున్నారు
బొమ్మలు గీయండి అన్నప్పుడు
రాదంటున్నారు
కవిత్వం రాస్తారా అనడగ్గానే
ఎనభై పేజీల నోటుపుస్తకాలు
రెండు తీసి చూపిస్తున్నారు

- ఆంధ్రజ్యోతి ఆదివారం, జూన్ 6, 2004

అనుకున్నదొకటయితే...

-తమిళన్బన్

గాలి ఎలా రాదో
చూద్దామని
కిటికీ తెరిచి వుంచాను...
గాలి వచ్చి
కిటికీ రెక్కల్ని
దఢాలున మూసి వెళ్ళింది

(2004 కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు పొందిన కవి)

- ఆంధ్రజ్యోతి ఆదివారం, జనవరి 23, 2005

ప్రజాస్వామ్యం

-వైరముత్తు

నాకు ప్రజాస్వామ్యమంటే యిష్టం
ఎన్నికలు అసలు యిష్టం లేదు
పెళ్ళి యిష్టం
ఈ పెళ్ళికూతురు నచ్చలేదు
ఎందుకని అడగరేం?
వధువు పుష్పవతి కాలేదు
వరుడు వంధ్యుడైన పిల్లాడు
ఇది బాల్య వివాహం
మరెందుకు శుభముహూర్తం?
ఇది బధిరుల కాలనీ
ఇక్కడెందుకు సింధుభైరవి రాగం?
చట్టాలు రాసిన చాణక్యుల్లారా!
మనిషినే మరచిన మనువారసుల్లారా!!
వాగ్దానాన్ని సృష్టించిన మాకియవెల్లుల్లారా!!!
మా ఓటర్లకు ఓటు హక్కునిచ్చారు కదా...బతుకు నిచ్చారా?

పోలింగ్ బూతులకు రమ్మని చెప్పారే...
వేలిముద్రలే సంతకాలా?
ఎన్నుకోవలసింది మనషులనే అయితే
మరి ఓట్లు వెయ్యాల్సింది సింహం, పులి, కోతి గుర్తులకెందులకో?
ఆ...అర్థమవుతున్నది...తెలిసివస్తున్నది...
ఈ ప్రజాస్వామ్యానికి ప్రజలు అవసరం లేదు
ఇక్కడి వేటగాళ్ళకి ప్రేతాలు చాలు
ఎన్నికలంటారా?
గొర్రెలకు ఊచకోత ఉత్సవం అయినా వాటికెంత ఉత్సాహం!
తమ కసాయి కొట్లను తామే
ఎంచుకోవడానికి వాటికి హక్కులున్నాయట!
బాగుంది మరి....
కాలం చీకటిలో జారిపోయి
కులం బురదలో కూరుకుపోయి
అదుగో...వేనవేల ఏళ్ళుగా వున్న బానిస బంధాలతో
వేం చేస్తున్నాడో మన ఓటరు మహాశయుడు
ఎక్కడికి? ఇంకెక్కడికి ఎన్నికల కేంద్రానికి
ఈ ఎన్నికల కేంద్రానికి వాహనాలు రెండు
ఓటు వేసేంతవరకు పల్లకి మొదటిదయితే
ఓటు వేసిం తర్వాత పాడె రెండవది
ప్రజాస్వామ్యం ఎత్తైన పర్వతంలాంటిదే!
న్యాయమే అందులో మాయమైన మాణిక్యం
మా ఓటర్లంతా కలిసి ఆ మాణిక్యాన్ని
ఐదేళ్ళకోమారు హడావుడిగా వెతుకుతారు
వెతికేవాళ్ళలో...రెండు కళ్ళూ వున్న వాళ్ళు పదిమంది

వీళ్ళు వాళ్ళ వాకిలే దాటరు పర్వతమేం ఎక్కుతారు?
ఒక కన్ను ఉన్నవాళ్ళు ఇరవైమంది
వీళ్ళ వెతుకులాట పర్వతం పైదాకా కాదు ప్రారంభంపరకే!
రెండు కళ్ళులేని వాళ్ళు ఎనభైమంది
వీళ్ళంతా కలిసికట్టుగా
వెతుకుతారు అన్వేషిస్తారు గవేషిస్తారు తండ్లాడుతారు
దేనికొరకు? పర్వతంలో మాయమైన మాణిక్యం కోసం
ఎనభైమంది అంధులు చేరి ఎక్కడ్కెడో దేవులాడుతారు
అయ్యో ప్రజాస్వామ్యమా! ఓహో ఓటరుమహాశయుడా!!!
చేపకు గాలం...పక్షికి వడిసెల-జింకకు వల-ఏనుగుకి పల్లం
కావాలి-రావాలి-తేవాలి-పోవాలి
మా ప్రజాస్వామ్యంలో ప్రజల్ని పట్టుకోవడానికి
ఏదీ అక్కర్లేదు ఒక వాగ్దానం చాలు కాస్త ఆలోచించండి...
పిల్లాడి చేతిలో కత్తి పిచ్చోడి చేతిలో తుపాకి తాగినోడి చేతిలో శిశువు
భారతీయుని చేతిలో ఓటు
పిల్లాడు పెరిగి పెద్దయ్యే వరకూ పిచ్చి తొలగి నయమయ్యేదాకా
తాగుబోతు బాగుపడే పర్యంతం ఎన్నికలను ఆపండి
లేదంటే ఈ దేశాన్ని నిప్పులతో కడగండి

- ఉదయ సాహితి, కరీంనగర్

కవిత్వం నేర్చుకున్నదిలా

-జి.ఎస్. శివరుద్రప్ప

నా చిన్ననాటి జ్ఞాపకాల వీధిలో
ఇంకా తిరుగుతున్నది
మా వూరి కుమ్మరి సారె.
చక్రం మధ్యలో మట్టి ముద్ద-
కుమ్మరి గుండన్న వేళ్ళ స్పర్శతో
మట్టి లోపల నిద్రిస్తున్న ఆకృతులు
ఒక్కటొక్కటే కళ్ళు తెరుస్తుంటే
ఎడతెగని విస్మయం!
అసలు కవిత్వం ఎలా పుడుతుందో
నేను మొదట తెలుసుకున్నదిలా

నా చిన్ననాటి జ్ఞాపకాల మబ్బుల్లో
ఇంకా వినవస్తున్నవి
సాలెల మగ్గం చప్పుళ్ళు.
పద్మశాలి గంగన్న ముందు

పరచుకుని వున్న రంగురంగుల
నూలు దారాల్లోపల దారులు వెతుకుతున్న
జింక, చేపల డిజైన్లు
అదొక వస్త్ర ప్రపంచం!
ఛందస్సుతో పాటు
కవిత్వానికి అవసరమైన
మాటల్ని నేర్చుకున్నదిలా
నా చిన్ననాటి జ్ఞాపకాల్లో
ఇంకా ప్రకాశిస్తున్నవి
ఎర్రటి ఎండలో
ఈకలు పోయి ఇప్పుడో అప్పుడో
ఎగరడానికి సిద్ధమైనట్లున్న
అనేకానేక ఒంటికాలి పక్షుల్లాంటి కొబ్బరిచెట్లు
ఇక్కడి మట్టి అంతరాంతరాల్లో
లోతుగా వేళ్ళూనుకుని మొలకెత్తి
ఆకాశమంత ఎత్తుకెదిగి
నిటారుగా నిలుచున్న ఈ చెట్లు
నిత్యం పచ్చగా బతుకుతున్న కవితలు.

- పత్రిక, జూన్ 2004

ఒక ఉత్తరం అనాథ అయిపోయింది

-ము.మేత్తా

ఎవరికి చేరాలో చిరునామా స్పష్టంగా లేదు
ఎవరు పంపుతున్నారో అది కూడా సరిగా లేదు
ఒక ఉత్తరం అనాథ అయిపోయింది
ఒక ఉత్తరానికి అన్యాయం జరిగిపోయింది
దానిమీద-
అనేకానేక ఊళ్ళ
ముద్రలు పడ్డాయి
అనేకానేక వీధుల్లో
విచారణ నడిచింది
అనేకానేక దినాలు
దొరలి దొర్లిపోయాయి
పుట్టినింటి పేరు లేదు
మెట్టినిల్లు మరి తెలియనే లేదు
ఆ ఉత్తరం గురించి
తపాలాఫీసుల ఆరా మొదలైంది

అతికించి వున్న
కవర్ లోపలి
కాయితమ్మీద
ఇలా రాసి వుంది

"ఓ వారంలోపు మీ నుండి జవాబు రావాలి
లేకపోతే ఈ హంస ఎగిరిపోవడం ఖాయం
ఆఖరుసారిగా ముద్దుపెట్టడానికి
నా సమాధికి రావాల్సి వుంటుంది"

ఎవరికి చేరాలో చిరునామా స్పష్టంగా లేదు
ఎవరు పంపుతున్నారో అది కూడా సరిగా లేదు
ఒక ఉత్తరం
అనాథ అయిపోయింది
ఒక ఉత్తరానికి
అన్యాయం జరిగిపోయింది

- నేటి నిజం, మే 28, 2004

గుజరాతీ కవిత

క్షేమంగా వున్నాడు

-కె.బి. చిత్రోడా

నీ యీ మిత్రుడు క్షేమంగా వున్నాడు
కవిత్వాలూ కాకరకాయల్లాంటి
పిచ్చిరాతలు ఎన్నడో వదిలేశాడు
నీ యీ మిత్రుడు క్షేమంగానే ఉన్నాడు

ఉదయంపూట లేస్తున్నాడు, సుష్ఠుగా భోంచేస్తున్నాడు
స్కూటర్ మీద ఎప్పట్లానే ఆఫీస్‌కి వెళుతున్నాడు
బల్ల సొరుగులో వూపిరిని 'లాక్' చేసి
ఫైళ్ల వనంలో హాయిగా శ్వాస తీసుకుంటున్నాడు.
అన్ని తేదీలకన్న ఎక్కువగా
మొదటి తేదీని ప్రేమిస్తున్నాడు
అయినా నీ యీ మిత్రుడు క్షేమంగా ఉన్నాడు

పర్సనల్ లైబ్రరీని పస్తులతో చంపుతున్నాడు
పూజా మందిరాన్ని వైభవంగా వుంచుతున్నాడు

ఆరు ఋతువుల్లో ఏదీ గుర్తులేనప్పటికీ
హాలిడే లిస్ట్ మాత్రం భట్టీయం పట్టేశాడు
కాయితమ్మీదికి కవిత్వాన్ని తీసుకొద్దామంటే
మిత్రమా! టైమెక్కడ? సమయమేది?
అయినా నీ యీ మిత్రుడు క్షేమంగానే ఉన్నాడు

నూతన సంవత్సరం, పెళ్లిరోజు, పుట్టినరోజు...
అన్ని పండుగలూ నువ్వు లేకుండానే జరుపుకుంటున్నాడు
అన్నట్లు... మరిచేపోయాను సుమా!
మాకిప్పుడు అందరికన్నా ఆదర్శప్రాయుడు బిల్‌గేట్స్
అతని తాళం చెవులు కూడా బంగారువేనట!
ఉంటాను... సెలవ్!
నీ యీ మిత్రుడు క్షేమంగానే ఉన్నాడు.
– ఆంధ్రభూమి, ఆదివారం డిసెంబర్ 2001

– ఆంధ్రభూమి ఆదివారం, డిసెంబర్ 30, 2001

మన మధ్య...

–నీలన్

నాకూ
నీకూ మధ్య
పోస్ట్‌మాన్ వస్తున్నాడు
చేపలమ్మే ఆవిడా
కూరగాయల ఆవిడా
పిల్లలూ, బాల్య చాపల్యాలూ
అన్నీ వస్తున్నాయి

నాకూ
నీకూ మధ్య
నేనొస్తున్నాను
నువ్వు వస్తున్నావు
ప్రళయం వస్తోంది.

– వార్త ఆదివారం, డిసెంబర్ 12, 1999

మెరుపులు

-మేత్తా దాసన్

మేఘాల పుట్టలో
మెలికల పాములు
పిడుగు పాటలకు
పక్క వాయిద్యాలు
వెలిగి ఆరిపోయే
విద్యుద్దీపాలు
వాన పుస్తకానికి
ఉపోద్ఘాతాలు
గగన కవివర్యుని
మినీ కవితలు

- వార్త ఆదివారం ,సెప్టెంబర్ 23, 2001

అతని రెక్కలెప్పుడూ

-అబ్దుల్ రహమాన్

నాలో యిద్దరు మనుషులున్నారు
ఒకడు గాయకుడు
ఒకడు పిచ్చివాడు

గాయకుడేదో వొక రాగాన్ని
ఎప్పుడూ ఆలపిస్తూనే వుంటాడు
అతని స్వరాలు పదాలతో
తయారైనవి కావు

గాయకుణ్ణి మీరంతా అభిమానిస్తారు
పిచ్చివాణ్ణి నా శత్రువులు ఆరాధిస్తారు
యిద్దరికీ అచ్చిరావడం లేదు
యిద్దరూ రెండు ఎదురెదురు భిన్న ధ్రువాలు
సత్యానికి వెలుతురూ, చీకటీ...
రెండూ పార్శ్వాలే కదా!

గాయకుడెప్పుడూ సత్యం తాలూకు
వెలుతురు పార్శ్వాన్నే చూస్తాడు
అందుకే
అతని నిలువెల్లా నక్షత్రాల లేపనం
పిచ్చివాడెల్లవేళలా సత్యపు
చీకటి పార్శ్వాన్నే చూస్తాడు
కాబట్టే
అతని రెక్కలకెప్పుడూ చీకటి మకరందం..

- మూసీ, ఆగస్టు 2001

దివిటీ చిన్నారులు

-జ్ఞానకూత్తన్

ఒక్కో యింటిమెట్లు ఎక్కుతూ దిగుతూ
వాళ్లు చింపిరి గుడ్డల్ని సేకరిస్తారు
ఆనాటి రాత్రి దేవుని ఊరేగింపుకి
దివిటీలు పట్టే చిన్నారులు వాళ్లు
చీరలు, చిరుగుల చొక్కాలు, నాల్గు మూరల లుంగీలు
కాస్త బావున్న వాటిని తమకోసం అట్టిపెట్టుకుంటారు
ఇతర సమయాల్లో మీకు వీధిలో
ఎన్నడైనా ఎప్పుడైనా తటస్థిస్తే
వాళ్లని దివిటీ చిన్నారులని ఆనవాళ్లు పట్టలేకపోతారు
కారణం వాళ్లు పెద్దాళ్లలా ముచ్చట్లు పెట్టుకుంటుంటారు
కొందరికి ప్రాథమిక పాఠశాలలో
చేరేందుకు ప్రాయం మించిపోయి వుంటుంది
మరి కొందరికి కోవెల గుండంలో
చేతులతోనే చేపలు పట్టే దుర్దశ రాసి వుంటుంది
పేదవాళ్ళయినా దివిటీ చిన్నారులు

పరస్పరం తిట్లూ చీవాట్లూ పెట్టుకుంటూ
దిట్టంగానే సంతోషంగానే కనిపిస్తారు
అయితే వాళ్లలో ఒకడు సహాధ్యాయి
దివినుండి భువికి దిగివచ్చిన నక్షత్ర సమూహంలా
దివిటీ దండు రెండువైపులా చేరి
దేవుని అందాన్ని రెట్టింపు చేసి చూపిస్తుంటే
చూసి తరించేందుకు రాని వాళ్లు
భక్తులెలా అవుతారు?
అలా ఉత్సవ విగ్రహం గుడికి చేరడం తరువాయి
గుడి గోడలకు ఆవల నేలమీద
సందులో-గొందులో
దివిటీ చిన్నారులు చేతులు బొబ్బలెక్కుతుండగా
తోముతూ రుద్దుతూ వాటిని చల్లార్చుతారు
నేను నా చిన్నప్పటి మిత్రులెందరినో మర్చిపోయాను
వాళ్లల్లో ఎందరెందరో తర్వాతి తరం
దివిటీగాళ్లకు మార్గదర్శకులు
అయినా నా స్మృతిలో వున్నది మాత్రం
దివిటీ వెలుగులో స్పష్టంగా కనిపించని
దేవాలయం మీద రాసిన గుడి పేరూ,
పక్కసందులో మూత్రపు వాసనతో కలగలిసిన
ఇప్పనూనె పొగ వాసనా.

(కవి మిత్రుడు యాకూబ్ కోసం....)

- వార్త ఆదివారం సెప్టెంబర్ 28, 2003

వీలునామా

-వైరముత్తు

పిల్లల్లారా! పుత్రులారా!!
నా రక్తావశేషాల్లారా!!!
వినండి...
ఏదో ఒకరోజు నా యింటి తలుపుల్ని
మృత్యువు తడుతుంది
నాలుక లంగరు వేస్తుంది
పెదాలు కదిలితే ప్రాణం వెళ్లకపోతుంది
శరీరంలో సైగ చేయడానికే శక్తి వుండదు
అందుకే పుత్రులారా!
అప్పుడు చెప్పాలనుకున్నవాన్ని
యిప్పుడే చెబుతున్నా
దీన్ని మీ గుండెలోతుల్లో రాసుకోండి!
నేను చచ్చాక...
నా మిత్రులు నేను తుమ్మిందంతా
సంగీతం అంటారు

నా శత్రువులు నా సంగీతాన్ని
మొత్తంగా తుమ్ములే అంటారు
పిల్లలూ!రెండూ అతిశయోక్తులూ, అసత్యాలే సుమా!
మరి ఇంతకూ నేనెవరిని?
వీడు చేతిగీతల్ని నమ్మనివాడు
గీతలు అరిగిపోయేలా
శ్రమించినవాడని చెప్పండి
వీడు పూలజాతికి పుత్రుడు
స్థిరాస్థిలాంటి మిత్రుడు
కాని సూర్యుణ్ణి జీర్ణించుకున్నవాడని చెప్పండి
'కూచిపూడిలో కుక్క మొరిగినా
సంగీతమే' అన్నట్లు
కుక్క వేషం వేసినా మొరగనివాడు
తీయగా మాత్రమే పాడినవాడు వీడని చెప్పండి
విమర్శకుల్ని గౌరవించినవాడు
విమర్శలను గౌరవించనివాడని వెల్లడి చేయండి
వెల్వెట్ తివాచీలపై నడిచినా
మనసులో మురికివాడలను
మరిచిపోడని చెప్పండి
మంత్రుల్ని మిత్రులుగా
మిత్రుల్ని మంత్రులుగా
పరిగణించేవాడని చెప్పండి
ప్రతి యుద్ధంలో జయించినా
ఏనాడూ యుద్ధాన్ని కోరనివాడని చెప్పండి
సమస్త భూమండలాన్నీ కౌగిలించుకున్నా

భారతదేశాన్ని మాత్రమే
ముద్దులాడినవాడని చెప్పండి

వీడి కలం కాయితంపై
తలదించిన ప్రతిసారీ
మానవత్వం తలెత్తుకుని
తిరిగిందని చాటండి
ఏ దేవతా యితణ్ణి ఆశీర్వదించకున్నా
కవిత్వానికి సిరా
కన్నీటితో రక్తంతో
తయారు చేసిన వాడని చెప్పండి
గాలిలేని గ్రహమూ
కవిత్వంలేని స్వర్గమూ
రెండూ ఒకటే అన్నవాడు వీడని చెప్పండి
కొబ్బరి చెట్టూ నదీతీరమూ కన్పించగానే
అక్కడే సమాధికావడానికి
సమ్మతించినవాడని చెప్పండి
నా సమాధిపై యిలా రాయండి
జననం : 13-07-1953
మరణం :
రాయకండి సుమా!
మరి నాకు మరణమే లేదా?
ఉంది
ఎప్పుడు?
ఎప్పుడు ఆకాశం జారిపోతుందో

అప్పుడు
ఎప్పుడు నేల కూలిపోతుందో
అప్పుడు
ఎప్పుడు గాలి మూర్ఛపోతుందో
అప్పుడు
ఎప్పుడు కడలి ఆగిపోతుందో
అప్పుడు

●●●

పిల్లలూ!
ఇప్పుడు చెప్పండి

ఆకాశం శాశ్వతం
భూమి శాశ్వతం
గాలి శాశ్వతం
కవిత్వం శాశ్వతం

2003లో కేంద్ర సాహిత్య ఆకాడమీ అవార్డు అందుకున్న కవి వైరముత్తు.

– ఆంధ్రజ్యోతి వివిధ మే1, 2004